వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 320
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
అక్టోబర్ 04, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. గ్రీవెన్స్ రద్దు



□ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికలు ముగిసిన తర్వాత తిరిగి గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

– వరంగల్ వాయిస్, జనగాం



# టార్గెట్.. తెలంగాణ

- ఆర్ఎస్ఎస్ విస్తరణకు అణువైన ప్రాంతంగా గుర్తింపు
- శతాబ్ది ఉత్సవాల పేరిట పలు కార్యక్రమాలు
- ఆదివారం మహానగరంలో రూట్ మార్చ్
- కాజీపేట, హనుమకొండ, వరంగల్ లో పథసంచలన్
- మోహన్ భగవత్ సభ సక్సెస్ తో రెట్టించిన ఉత్సాహం
- బీజేపీకి ప్లస్ అయ్యేలా ప్రణాళికలు




తెలంగాణలో విస్తరించడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తోంది. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తోంది. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల పేరిట పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా మధ్యలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలు ఒక రేంజ్ లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా అక్టోబర్ 5 ఆదివారం ఉదయం వరంగల్ మహానగరంలోని కాజీపేట, భవాని నగర్, విశ్వవిద్యాలయ నగర్, హసన్ పర్తి నగర్, హనుమకొండ నగర్, కాశీబుగ్గ పద్మనగర్, ఖిలావరంగల్, వరంగల్ నగరాల్లో రూట్ మార్చ్ (పథసంచలన్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో వేలాదిమంది స్వయం సేవకులు యూనిఫాంతో పాల్గొననున్నారు. 2019లో హైదరాబాద్ లో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన పథసంచలన్ ఒక వైబ్ క్రియేట్ చేసిందనే చెప్పవచ్చు. అదే తరహాలో వరంగల్ లో పథసంచలన్ నిర్వహించేందుకు పెద్ద స్కెచ్ వేశారు. స్వయం సేవకులు ప్రధాన రోడ్లపై పెద్ద ఎత్తున మార్చ్ ఫాస్ట్ నిర్వహించడాన్ని చూసి మరింత మంది ఇందులో చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఇది రాజకీయ పరంగానూ బీజేపీకి ప్లస్ అయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..




# సుప్రీంకోర్టుకు చేరిన రిజర్వేషన్ల పంచాయితీ..

తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. బీసీ రిజర్వేషన్లపై తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం అంటూ వంగా గోపాల్ రెడ్డి శనివారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. మరో వైపు బీసీ రిజర్వేషన్లపై మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు ఈ నెల 8వ తేదీన తిరిగి విచారణ జరపనుంది. ఎన్నికల కోసం షెడ్యూల్ రిలీజ్ అయిన నేపథ్యంలో ఓ వైపు హైకోర్టులో మరో వైపు సుప్రీంకోర్టుకు ఈ అంశం చేరడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. దీంతో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ఇచ్చిన జీవో నంబర్ తొమ్మిది విషయంలో హైకోర్టు, సుప్రింకోర్టులు ఏం చెప్పబోతున్నాయి? జీవో అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాయా లేక బ్రేకులు వేస్తాయా అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే హైకోర్టులో కేసు విచారణపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశావహులు ఉత్కంఠతో ఉండగా తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్‌తో పరిస్థితి మరింత ఉత్కంఠగా మారింది.

– వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కీలక అంశాలపై అధికారులకు పలు సూచనలు



2లో..


# ఆయిల్ పామ్ హబ్ గా తెలంగాణ

□ స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి

# టార్గెట్ తెలంగాణ

- ఆర్ఎస్ఎస్ విస్తరణకు అనువైన ప్రాంతంగా గుర్తింపు
- శతాబ్ది ఉత్సవాల పేరిట పలు కార్యక్రమాలు
- ఆదివారం మహానగరంలో రూట్ మార్చ్
- కాజీపేట, హనుమకొండ, వరంగల్ లో పథసంచలన్
- మోహన్ భగవత్ సభ సక్సెస్ తో రెట్టించిన ఉత్సాహం
- బీజేపీకి ప్లస్ అయ్యేలా ప్రణాళికలు






**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** దేశంలో కొన్ని ప్రాంతాలే ఆర్ఎస్ఎస్ కు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. అందులో ప్రధానమైంది, ముఖ్యమైంది తెలంగాణే. అందుకే ఇక్కడ శాఖల విస్తరణకు బహుముఖ ప్రణాళికలు రచిస్తున్నారు. భారీ టార్గెట్లు నిర్దేశించారు. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఇందుకుగాను ఇటీవల బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణలో బీజేపీ మరింత బలపడాలంటే అందుకు మూలంగా భావించే ఆర్ఎస్ఎస్ విస్తరణ అనివార్యంగా మారింది.

### ఏడాదిపాటు శతాబ్ది ఉత్సవాలు

ఆర్ఎస్ఎస్ 1925 సెప్టెంబర్ 27న నాగ్ పూర్ లో పురుడు పోసుకుంది. దీంతో ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా వరకు శతాబ్ది వేడుకలను ఓ రేంజ్ లో నిర్వహించేలా సంఘ్ పథకం రూపొందించింది. అంతే కాదు.. విస్తరణ కూడా ఎవరూ ఊహించని వేగంతో చేయాలనుకుంటోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతోంది. రాబోయే విజయదశమి రోజున చరిత్ర తిరగరాయాలని ఆర్ఎస్ఎస్ అనుకుంటోంది. తమిళనాడు మొదలుకుని కశ్మీర్ దాకా పథసంచలన్, శోభాయాత్రలు, ఘోష్ ఇవన్నీ చేయబోతున్నారు.

### 4 వేలకుపైగా కొత్త శాఖలు

అసలు విషయం ఏంటంటే.. తెలంగాణలో ఆర్ఎస్ఎస్ మరింత బలపడేలా వ్యూహం రచించింది సంఘ్. ఇప్పటికే ఇక్కడ బీజేపీ కొత్త జోష్ తో ఉంది. అలాంటి సమయంలో తెలంగాణలోని ప్రతి గ్రామంలో ప్రతి బస్తీలో సంఘ్ శాఖలు నిర్వహించేలా కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రతి పల్లెలో ఉనికి ఉండేలా చూసుకుంటున్నారు. 2026 దసరా నాటికి తెలంగాణలో 4 వేలకు పైగా కొత్త శాఖలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలలో 10 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్ గా పరిగణిస్తారు. ఆ లెక్కన శాఖలకు ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటే స్లమ్స్ లో సేవాబస్తీల పేరిట సంఘ్ విస్తరణ ప్రయత్నం చేసుకుంటున్నారు. అంటే హిందూ సొసైటీలో ఏ వర్గాన్ని కూడా పక్కన పెట్టకుండా అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ, నవంబర్ లేదా డిసెంబర్ నెలల్లో రాష్ట్రంలో ప్రజాభిప్రాయ ప్రచారాన్ని కూడా ఆర్ఎస్ఎస్ మొదలు పెట్టబోతోంది.

### విస్తరణే లక్ష్యం..

రాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినప్పటికీ సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం సంఘ్ స్పెషాలిటీ. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. కేవలం సంఘ్ భావజాల వ్యాప్తే కాదు.. ఇంకొన్ని లక్ష్యాలు కూడా ఇప్పటికే వారు పెట్టుకున్నారు. సామాజిక అంశాలైన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ఫోకస్ పెంచుతున్నారు. అటు సంఘ్ కార్యకలాపాల్లో చేరే యువకుల సంఖ్యకూడా రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి ఏడాది లక్షలాది మంది యూత్, ముఖ్యంగా 14–25 ఏళ్ల మధ్య వయసున్న వారే సంఘ్ లో చేరుతున్నారు.

### మహిళలను రక్షణ..

అంతే కాదు.. గ్రామ వికాస కార్యక్రమాల పేరుతో మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి ఆపద వస్తే రక్షణగా నిలబడడం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోసంపద వృద్ధి, కుటుంబాల్లో మనస్పర్థలు తగ్గించేలా, వృద్ధులను ఆదరించేలా, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించేలా చేయడం, సోషల్ మీడియా అనర్థాలపైనా కార్యక్రమాల నిర్వహణ ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యంగా ఉంది.

### గ్రేటర్ వరంగల్ లో..

ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వరంగల్ మహానగరంలోని కాజీపేట, భవాని నగర్, కాకతీయ విశ్వవిద్యాలయం, హసన్ పర్తి, హనుమకొండ, కాశీబుగ్గ, ఖిలా వరంగల్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం రూట్ మార్చ్ (పథసంచలన్) నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ మహానగర సంఘ చాలకులు డాక్టర్ బందెల మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథ సంచలన్ లో వేలాది మంది స్వయం సేవకులు పూర్తి గణవేశ (యూనిఫాం) తో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ రూట్ మార్చ్ లో ముందు వాహనంపై భరతమాత, డాక్టర్ జీ, గురూజీ చిత్రపటాలతోపాటు భగవద్ ధ్వజం అలంకరింపబడి ఉంటుందన్నారు. మధ్యలో ఘోష్ వాదకులు ఆనక్, వంశీ(వేణువు), పణవ, త్రిభుజి, జల్లరి, శంఖ, శృంగ వాయిద్యాలు వాయిస్తూ రూట్ మార్చ్ లో పాల్గొంటారి వెల్లడించారు. ఈ రూట్ మార్చ్ కు ఘోష్ ప్రముకుడు నేతృత్వం వహిస్తారన్నారు. ఆ వెనక స్వయం సేవకులు రూట్ మార్చ్ చేస్తూ గీతాలాపన చేస్తూ అనుసరిస్తారన్నారు. హిందూ సమాజంలో జాగృతిని కలిగిస్తూ స్ఫూర్తిని నింపడానికి శతజయంతి సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ దేశవ్యాప్తంగా ఈ రూట్ మార్చ్ లను నిర్వహిస్తుందని తెలిపారు.

## అమెరికాలో దుండగుడి కాల్పులు

- హైదరాబాద్ విద్యార్థి చంద్రశేఖర్ మృతి
- సీఎం రేవంత్ దిగ్భ్రాంతి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్, మీర్‌పేట్ టీచర్స్ కాలనీకి చెందిన 35 ఏళ్ల పోలె చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## ఆయిల్ పామ్ హబ్ గా తెలంగాణ | స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాల్లో 11 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. దమ్మపేట మండల పరిధిలోని లింగాలపల్లి గ్రామ సమీపంలో తెలంగాణ ఆయిల్ ఫామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కోటయ్య ఆయిల్ ఫామ్ గార్డెన్ లో ఆయిల్ పామ్ రైతు అవగాహనా మేళా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫేడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరయ్యారు. సభ ప్రారంభంలో జంగా రాఘవ రెడ్డి మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాలలో 11 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసము ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఈ సభలో ఆలపాటిని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ఫార్మ్ రైతు ప్రెసిడెంట్ గా ప్రకటించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు రెండు లక్షల 70 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగులో ఇప్పటికే ఉందని రానున్న కాలంలో 11 లక్షల ఎకరాలు సాగు టార్గెట్ కు చేరుకునేందుకు ఈ మీటింగ్ రైతులకు ఉపయోగమని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఆయిల్ పాం సాగు శరవేగంగా ముందుకు వెళ్తుందన్నారు. రైతులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర సంఘం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రతి మెట్రిక్ టన్నుకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలకు కనీస హామీ ధర అమలు చేయించేందుకు కృషి చేస్తోందన్నరు. రైతులకు ఉత్తమ సేవలు అందించడానికి, ఆయిల్ పామ్ సాగు అవకాశాలు, పద్ధతులు, అనుభవాలను పంచుకునేందుకు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైతులు–ప్రైవేట్ కర్మాగార ప్రాంత రైతులు కూడా–పాల్గొని, తమ అనుభవాలను, పంచుకుంటూ, సంఘటితంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, పాత దిగుమతి ప్రకారమే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కాబట్టి రైతు సోదరులారా మీరంతా ఆయిల్ ఫామ్ వేసి ఎకరానికి లక్ష రూపాయలు నెలకు ఆదాయం సంపాదించేలా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట, సత్తుపల్లి, కొత్తగూడెం శాసనసభ్యులు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రూప్ వన్ అధికారి రాహుల్‌ను సత్కరించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదరికాన్ని జయించి, పట్టుదలతో చదివి గ్రూప్-1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీఓ) ఉద్యోగం సాధించిన గాలి రాహుల్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అభినందించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన గాలి విజయలక్ష్మి–రవికుమార్ దంపతుల కుమారుడు రాహుల్, గ్రూప్-1లో ఉద్యోగం పొందిన సందర్భంగా నేడు ఎమ్మెల్యే నాగరాజుని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "పేద కుటుంబం నుంచి కష్టాలను ఎదుర్కొంటూ, ఎంతో పట్టుదలతో చదువుకొని అంచలంచలుగా ఇంతటి ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించడం గర్వకారణం," అని ప్రశంసించారు. ఈ విజయంతో రాహుల్ కేవలం తల్లిదండ్రులకు మాత్రమే కాకుండా, మామునూరు గ్రామానికి, వరంగల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికే పేరు ప్రఖ్యాతులు తెచ్చారని కొనియాడారు. ఎమ్మెల్యే నాగరాజు రాహుల్‌కు స్వీట్ తినిపించి, శాలువా కప్పి సత్కరించారు. అలాగే, ఉన్నత స్థాయికి చేరే విధంగా కష్టపడి కుమారుడిని చదివించిన తల్లిదండ్రులు విజయలక్ష్మి, రవికుమార్ దంపతులను కూడా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ మరింత ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ-విక్టర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్య శ్రేయస్సుపై అవగాహన

• లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2కె రన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ (డిస్ట్రిక్ట్ 320 ఎఫ్,రీజియన్-6, జోన్ 3) మానసిక ఆరోగ్య, శ్రేయస్సు అవగాహన వారోత్సవాన్ని ఈనెల 4 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వారోత్సవంలో భాగంగా "మానసిక ఆరోగ్యం లేనిదే శరీరక ఆరోగ్యం లేదు"అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో, శనివారం నాడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 2కె రన్‌ను నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డా. బానోత్ వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకియాట్రిస్ట్ డా. బండి రాధిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. రాధిక రెడ్డి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం లేకుండా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదు అని ఉద్ఘాటించారు. ఈ కీలకమైన అవగాహనను సమాజంలో విస్తృతంగా చాటేందుకు లయన్స్ క్లబ్ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఈ వారోత్సవంలో మానసిక ఆరోగ్యంపై సెమినార్లు, అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం జోన్ చైర్మన్ లయన్ ఎం. వెంకట్ రెడ్డి, కార్యదర్శి లయన్ పర్కాల రవీందర్ రెడ్డి, కోశాధికారి లయన్ కొండపల్లి కరుణాకర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో విజయవంతమైంది. వీరితో పాటు క్లబ్ జోన్ చైర్మన్ మాదవపెద్ది వెంకట్ రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులు అనుమాల వెంకటేశ్వర్లు, సీనియర్ బాధ్యులు డాక్టర్ వెనిగళ్ల జగన్మోహనరావు, ఘనపురపు అంజయ్య, బవిరిశెట్టి నాగేశ్వర్ రావు, మాలె కాళీనాథ్, పారుపల్లి రమేశ్, చౌడవరపు సుధాకర్, మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం (ఎంజేఎఫ్), అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కామ సంజీవరావు, మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, తులసి గిఫ్ట్ సెంటర్ పరంధామయ్య, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాలపిండెల మల్లయ్య, సెక్రటరీ బఆకుల శంబయ్య, కాఫీ క్లబ్ సభ్యులు ఆకుల రాజు, వంగ రామన్న, కొల్లూరు రవికుమార్ వంటి పలువురు ప్రముఖులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

◆ ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

◆ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో భారతీయ స్టేట్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్ బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ) పలు ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస. రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలు అక్టోబర్ 08 నుంచి ప్రారంభమవుతాయన్నారు. సీసీ టీవీ ఇన్స్టలేషన్ కోర్సు 13 రోజులు, ఎలక్ట్రిషియన్ హౌస్ వైరింగ్ కోర్సు 30 రోజులు, మొబైల్ రిపేరింగ్ కోర్సు 30 రోజులు, ఏసీ రిపేరింగ్ కోర్సు 30 రోజులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8 నుంచి 45 సంవత్సరాల లోపు వారు తెలుగులో చదవడం, రాయడం వచ్చి ఉండాలని, తెలుపు (వైట్) రేషన్ కార్డు కలిగి ఉండాలి, దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారై ఉండాలన్నారు. మున్సిపాలిటీ ప్రాంతాల నివాసులు అర్హులు కారని తెలిపారు. చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు కూడా అర్హులు కారన్నారు. వరంగల్ రూరల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పించబడుతుంది. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా ఇవ్వబడుతుంది.శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్ అందజేయబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు భారతీయ స్టేట్ బ్యాంక్ – గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, సంస్కృతి విహార్, టీటీడీసీ, హసన్ పర్తి, వరంగల్ జిల్లాలో పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, తెలుపు రేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, విద్యార్హత జిరాక్స్ కాపీలు జత చేసిన దరఖాస్తుతో తమ వివరాలను ఈనెల 8లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 97040 56522, 9849307873, 6281260878, 9949108934లలో సంప్రదించాలని తెలిపారు.

# మాజీ మంత్రి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే నాయిని నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల దివంగతులైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం నివాళులు అర్పించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి అంతిమ సంస్కారాలలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అభిమానాన్ని, అనుభవాన్ని, ఆప్యాయతను పంచిన ఆ మహనీయుడి లేని లోటు తీరనిది. వారి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం" అని పేర్కొన్నారు. దామోదర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన పెద్ది



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నల్లబెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు వర్ణం నర్సింహారెడ్డి, సాయి ప్రసన్న వివాహ మహోత్సవం గిర్నిబావిలోని జీఆర్‌బీ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది దంపతులు హాజరయ్యారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, పట్టణ పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీలు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# సీఐ రఘుపతి రెడ్డిపై ఆరోపణలు సరికాదు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పట్టణంలో దసరా ఉత్సవం సందర్భంగా సీఐ రఘుపతి రెడ్డి తన విధి నిర్వహణలో ఉన్న సమయంలో జరిగిన ఒక సంఘటనపై కొందరు రాజకీయ నాయకులు, సంఘ పెద్దలు చేస్తున్న ఆరోపణలను ఎన్.హెచ్.ఆర్.సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ తీవ్రంగా ఖండించారు. విజయదశమి వేడుకల సందర్భంగా స్థానిక బొడ్రాయి ఆవరణలో వేలాది మంది ప్రజలు గుమిగూడిన సమయంలో, ప్రజలను నియంత్రించే విధిలో సీఐ ఉన్నారు. ఈ క్రమంలో, రెప్పపాటులో ఆయన గమనించని సమయంలో పట్టణానికి చెందిన కొందరు జంతుబలి చేయటం జరిగింది. సంగెం రమేష్ ఈ విషయంపై స్పందిస్తూ "వేలాది మంది తరలివచ్చిన ప్రజానీకాన్ని అదుపు చేసే ప్రయత్నంలో సీఐ ఉండగా ఈ సంఘటన జరిగింది. ఇందులో సీఐకి ఎలాంటి ప్రమేయం లేదు," అని స్పష్టం చేశారు. కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేయడం, సీఐపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. "పోలీసులు అంటే అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడేవారు. ఎలాంటి ఆపద వచ్చినా స్పందించేది వారే. అలాంటి వారిపై నిరాధారమైన ఆరోపణలు చేసి, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించకూడదు," అని సంగెం రమేష్ కోరారు. ఈ విషయంలో సీఐ తప్పు లేదని ఆయన మరోసారి తెలియజేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, అక్టోబర్ 04, 2025

## జర్నలిస్ట్ గండి సీతారాంకు పరామర్శ



**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** మానుకోట జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా కోశాధికారి, దోర్నకల్ సాక్షి టీవీ జర్నలిస్ట్ గండి సీతారాం తల్లి సుభద్రమ్మ (78) సోమవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుభద్రమ్మ మృతదేహం వద్ద టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్, కురవి అధ్యక్షులు సురేష్ తో పాటు దోర్నకల్, గార్ల, కురవి, మరిపెడ, మానుకోట ప్రాంతాల జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. వారు సీతారాం కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీతారాం కుటుంబానికి జర్నలిస్టులు అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## నిజమైన సేవకుడిని ఎన్నుకోవాలి

### స్థానిక ఎన్నికల్లో ఓటును అమ్ముకోకండి

### డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్



**వరంగల్ వాయిస్, దామెర :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు నీతి నిజాయితీ గల నాయకులను గెలిపించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం దామెర మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు సేవకుడిగా ఉండే వ్యక్తిని మాత్రమే ఓటు వేసి గెలిపించాలి. డబ్బు, మద్యం తదితర వస్తువులకు ఆశపడి మీ అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దు," అని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోకూడదని కరుణాకర్ నొక్కి చెప్పారు. ప్రజలు కింది అంశాలు దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని ఆయన కోరారు: ప్రజలందరి అభివృద్ధి పనుల కోసం పరితపించే, స్వార్థం లేని నాయకుడిని ఎన్నుకోవాలి. కుల, మత బేధాలు లేకుండా అందరినీ కలుపుకొని పోయే నాయకుడిని ఎన్నుకోవాలి. సంక్షేమ పథకాలు అందరికీ అందించే దిశగా, పార్టీలకు అతీతంగా పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలి. క్షేత్రస్థాయిలో బలంగా, అనుభవం కలిగిన నాయకుడిని ఎన్నుకోవాలి. ప్రజలు, మహిళలు, పురుషులు, ఉద్యమ నాయకులు, ప్రజా సంఘాలందరూ ప్రతి ఊరిలో, ప్రతి నియోజకవర్గంలో, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఇలాంటి నాయకులను ఎన్నుకునే విధంగా ఐక్యమైన నిర్ణయంతో ముందుకు సాగాలని కొమ్ముల కరుణాకర్ ఆకాంక్షించారు.

## చట్ట ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సీఐ సంతోష్ హెచ్చరించారు. శనివారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో నలుగురు రౌడీషీటర్లను పిలిపించి సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ మాట్లాడుతూ, "ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, స్థానిక ఎన్నికల్లో చట్టాన్ని ఉల్లంఘించి, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. ఎంతటి వారైనా కఠిన చర్యలను ఎదుర్కోవలసి వస్తుంది," అని స్పష్టం చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలను ఉల్లంఘించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, రాజకీయ నేరాలకు పాల్పడినా, ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, శాంతిభద్రతలను కాపాడడానికి ముందస్తు చర్యలు చేపట్టామని సీఐ సంతోష్ తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

◆ నోట్లతో ఓట్లను కొనే అభ్యర్థులను తిరస్కరించాలి

◆ పిలుపునిచ్చిన సీపీఐ నాయకులు




**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** త్వరలో రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నీతి, నిజాయితీ గల అభ్యర్థులను, లౌకిక వామపక్ష పార్టీలను గెలిపించాలని సీపీఐ నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసే అభ్యర్థులను తిరస్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎల్లాపూర్ గ్రామంలో దోమ రాకేష్, మజ్జిగ అజయ్ అధ్యక్షతన జరిగిన హసన్‌పర్తి మండల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హనుమకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె భిక్షపతి, భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూభారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, 2025 డిసెంబర్ 26న శత వార్షికోత్సవం ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. శ్రామిక, రైతు, కష్టజీవుల పక్షాన నిరంతర పోరాటాలు చేసి, శ్రమజీవులకు అనేక విజయాలు సాధించి పెట్టిన పార్టీ సీపీఐ అని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓట్ల తొలగింపు, ఓట్ల చోరీతో అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, పది సంవత్సరాలుగా ప్రజలపై జీఎస్టీ విధించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. కొల్లగొట్టిన ఆ సొమ్మును తిరిగి ప్రజలకు చెల్లించాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర సంస్థలైన జ్యుడిషరీని, సీబీఐని, గవర్నర్ పదవిని, రాష్ట్రపతి పదవిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త కోటీశ్వరులకు 15 లక్షల కోట్లు మొండి బకాయిల పేరుతో లోన్స్ రైట్ ఆఫ్ చేయడం క్షమించరాని విషయం అన్నారు. చిన్న, సన్నకారు రైతులు, పేదలు లక్ష, పది లక్షల లోన్ తీసుకోని చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు చేసే పాలకులు, ధనవంతులకు మాత్రం అప్పులు రద్దు చేయడం అన్యాయం అని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, సీపీఐ సీనియర్ నాయకులు మోతిలింగారెడ్డి, హసన్‌పర్తి మండల సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, బీఎస్ఎన్ఎల్ నాయకులు సాంబయ్య, జక్కుల సాంబరాజు, మడిపల్లి గిన్నారపు రాజు, అనంతసాగర్, దాసు, వంగపాడు నాంపల్లి లక్ష్మయ్య, నేదునూరి రామచందర్, నేదునూరి చేరాలు, దోమ రాజమౌళి, వంగపాడు వెంకటేష్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఐఫోన్ అప్పగింత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న లక్ష రూపాయల విలువైన ఐఫోన్ 16 ప్రో మొబైల్‌ను హనుమకొండ పోలీసులు ట్రేస్ చేసి, బాధితుడికి అప్పగించారు. గుడిబండలకు చెందిన హరికిషన్ ఈ సంవత్సరం జూన్ నెలలో ములుగు క్రాస్ రోడ్‌లో తన ఐఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో తన మొబైల్ వివరాలను నమోదు చేసుకున్నాడు. శనివారం హనుమకొండ పోలీస్ స్టేషన్ ఐటీ కోర్ టీంకు చెందిన రఘుపతి మొబైల్‌ను విజయవంతంగా ట్రేస్ చేశారు. అనంతరం స్టేషన్ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ చేతుల మీదుగా హరికిషన్‌కు ఆ ఫోన్‌ను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ మాట్లాడుతూ ఎవరైనా తమ మొబైల్‌ను పోగొట్టుకున్నట్లయితే ఆలస్యం చేయకుండా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

## ఉప్పల్ బస్సు ఆపరేషన్ పాయింట్‌ను సందర్శించిన టీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వై.నాగిరెడ్డి శనివారం నాడు ఉప్పల్‌లోని బస్సు ఆపరేషన్ పాయింట్‌ను సందర్శించారు. ఉప్పల్ క్రాస్ రోడ్ వద్ద గల వరంగల్ రీజియన్ ఆపరేషన్ పాయింట్ లో పాటు సిటీ ఆపరేషన్ పాయింట్‌లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల ఏర్పాట్లు: ప్రయాణికులు కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి. బస్సులు నిలపవలసిన స్థలాన్ని, పార్కింగ్ స్థలాలను పరిశీలించి, వాటి అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఈ సందర్శన తనిఖీ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) వెంకన్న, చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, మరియు వరంగల్ రీజనల్ మేనేజర్ డి. విజయభాను తదితరులు పాల్గొన్నారు.

# గణేష్‌ను సత్కరించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట/హనుమకొండ :** గొప్ప ప్రతిభ కనబరిచి, ఎలాంటి శిక్షణ లేకుండానే ఎంబీబీఎస్ సీటు సాధించిన అరుముల్లా గణేష్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అభినందించారు. గణేష్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎనుమాముల గ్రామానికి చెందిన యువకుడు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఎన్నో కష్టాలను తట్టుకుని ఆయన ఈ విజయాన్ని సాధించడం గర్వకారణం అని ఎమ్మెల్యే నాగరాజు ప్రశంసించారు. ఈ సందర్భంగా గణేష్ ఎమ్మెల్యే హనుమకొండలోని సుబేదారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నాగరాజు గణేష్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గణేష్ వైద్య విద్యకు అవసరమైన పరికరాలను అందజేస్తూ, ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. అంతేకాక, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న గణేష్ విద్య కొనసాగించేందుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సౌరం చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు దామెర ఆనందం, సౌరం ప్రభాకర్, మాణిక్యం, అభికేషం, సౌరం అభిలాష్, దాసుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం



◆ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలన పట్ల ఆకర్షితులై, ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. కొంగర సుమన్, కోడెపాక రమేష్, ఎల్లగొండ అనిల్, తుడుం రమేష్, తిక్క రాజుతో పాటు పలువురిని బీజేపీలోకి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, బీజేపీ పరకాల నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కచం గురుప్రసాద్, బీజేపీ నాయకులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, గట్టు వేణు గౌడ్, రవ్వ శివప్రసాద్, బలవంతుల రాజు, ఇర్సడ్ల సదానందం, సముద్రాల రవి, శ్రవణ్ కుమార్, ముద్దెర గోపాల్, కోడెపాక రాజు, కొమ్ముల ప్రవీణ్, నకినబోయిన రమేష్, పూజారి రవి, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కృషి చేయాలి

● మహిళా పోలీసులకు క్రైమ్ ఏసీపీ సదయ్య సూచన



**వరంగల్ వాయిస్, క్రైమ్ :** కుటుంబ వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిపై ఉందని క్రైమ్ ఏసీపీ సదయ్య పేర్కొన్నారు. భార్యాభర్తల మధ్య సఖ్యత కుదర్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం నాడు క్రైమ్ ఏసీపీ సదయ్య రంగంపేటలోని వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్-1ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, కేసుల సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏసీపీ పెండింగ్ కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులు, నిందితుల అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖాపరమైన సమస్యలపై స్టేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సదయ్య మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య జరిగే గొడవలపై స్టేషన్‌కు వచ్చే బాధితులకు సరైన కౌన్సిలింగ్ నిర్వహించి, వారి మధ్య సఖ్యతను కుదర్చడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి. అదే సమయంలో, మహిళా బాధితులకు సరైన రీతిలో న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఏసీపీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కు సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి



◆ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు బిజెపి సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ అయిన పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికాక ముందే కాంగ్రెస్ పార్టీపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, చెప్పిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది," అని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఆయన కార్యకర్తలకు ఈ కింది అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు: గ్రామాలలో అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతవాసులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నది గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమే. ప్రభుత్వ వైఫల్యాలు: కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనను, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాలి. వార్డ్ మెంబర్, సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి అన్ని స్థానాల్లోని బీజేపీ అభ్యర్థులకు గ్రామాలలో ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడానికి బీజేపీ కార్యకర్తలు సైనికుల వలె పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జనగామ జిల్లా ఉపాధ్యక్షులు కావటి ముత్యాలు, జిల్లా నాయకులు వల్లాల ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సోమేశ్వర్, కట్ల సదానందం, వల్లాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తెలంగాణ గౌడ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా కొయ్యడ ప్రవీణ్ కుమార్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లా గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు గండి లక్ష్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో కొయ్యడ ప్రవీణ్ కుమార్ గౌడ్ ను వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శిగా నియమించారు. సహాయ కార్యదర్శిగా ఎన్నుకోబడిన సందర్భంగా కొయ్యడ ప్రవీణ్ కుమార్ గౌడ్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# బెల్ట్ షాప్‌పై దాడి

## రూ. 8,400 విలువైన మద్యం పట్టివేత



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను నిల్వచేసి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన ఆత్మకూరు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పాండవుల రఘు తన కిరాణా షాప్‌లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు రఘును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ. 8,400 విలువ గల పలు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రఘుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ చేసినా లేదా విక్రయాలు జరిపినా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 5న కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

**వరంగల్ వాయిస్, జనగామ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీ సత్య సాయి కన్వెన్షన్ హాల్ లో సమావేశం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన జరుగుతుంది. ఈ సమావేశంలో ప్రధానంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సమగ్ర చర్చ నిర్వహించడం జరుగుతుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను అనుసరించి పోటీ చేయదల్చుకున్న ఆశావహులు తమ దరఖాస్తులను ఈ విస్తృత స్థాయి సమావేశంలో అందజేయవలసి ఉంటుంది. ఈ ముఖ్యమైన సమావేశానికి జిల్లా, నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జనగామ, స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, చిల్పూరు, జీడికల్ దేవస్థాన కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు మరియు డైరెక్టర్లు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# వంద మంది విద్యార్థులకు వైద్య పాఠమైన ఎల్లమ్మ దేహం



**వరంగల్ వాయిస్, జయశంకర్ భూపాలపల్లి :** తమ తల్లి కోరిక మేరకు, సమాజ హితం కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరు నివాసి దేవునూరి ఎల్లమ్మ (80) దేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు వైద్య విద్య నిమిత్తం దానం చేశారు. ఎల్లమ్మ మరణం వందలాది మంది వైద్య విద్యార్థులకు శాస్త్ర పరిశోధన, సర్జరీ, వైద్య పాఠాలు నేర్చుకోవడానికి ఉపయోగపడనుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఎల్లమ్మ అనారోగ్యంతో మరణించగా, వారి కుమారుడు దేవనూరు చంద్రమౌళి, ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్ల కలిసి వారి తల్లి ఆశయాన్ని నెరవేర్చారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో దేహాన్ని వరంగల్‌లోని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యకి లాంఛనంగా అప్పగించారు. అనంతరం అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత్, అనాటమీ విద్యార్థులు, సిబ్బంది (ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్) పార్థివ దేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ, "ఎల్లమ్మ తల్లి దేహం మరణం తర్వాత కూడా 100 మంది వైద్య విద్యార్థులకు శాస్త్ర పరిశోధనకు, సర్జరీకి, వైద్య విద్య నేర్చుకోవడానికి ఉపయోగపడింది. శరీర దానం చేసిన కుటుంబ సభ్యులకు మా ప్రత్యేక ధన్యవాదాలు," అని తెలిపారు. ఈ గొప్ప కార్యంలో ఎల్లమ్మ గారి బంధుమిత్రులు, కే కుమారస్వామి, రవి, రాములు, రాజు, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పెండ్లి ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునిగాల పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ. రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు, ఉపాధ్యక్షులు మోహినూద్దీన్, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నాహాలు

## అభ్యర్థుల ఎంపికపై నడికూడ మండల సమావేశం



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కంఠాత్మకూర్, ధర్మారం, సర్వాపూర్, కౌకొండ, వెంకటేశ్వర్లపల్లి, నార్లపూర్, పులిగిల్ల, రాయపర్తి, వరికోల్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఈ సమావేశాలు జరిగాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న ఆశావహుల జాబితాను ఈ సందర్భంగా సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు) మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను ప్రతి ఒక్క కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి, అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు, మండల యూత్ నాయకులు, ఆయా గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## శాయంపేట ఎస్సై పరమేశ్వర్ హెచ్చరిక

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు. శనివారం నాడు ఎస్సై పరమేశ్వర్ తన సిబ్బందితో కలిసి శాయంపేట మండలంలోని గంగిరెణిగూడెం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన బానోత్ రమేష్ తన ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నాడనే విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, రమేష్ గుడుంబా అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై పరమేశ్వర్ మాట్లాడుతూ గుడుంబాను అమ్మినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని మండల ప్రజలను హెచ్చరించారు.

# దీపావళికి నరకాసుర వధ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



## ◆ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హామీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 19న దీపావళి పండుగ సందర్భంగా జరిగే నరకాసుర వధ ఉత్సవాలకు వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయిస్తామని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. శనివారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మేయర్, కమిషనర్లను కలిసి వారికి బొకే అందజేసి, తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సత్సంకల్పంతో గత 23 సంవత్సరాల నుంచి వరంగల్ కుడా ప్రాంగణంలో 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహాన్ని దహనం చేసే కార్యక్రమాన్ని ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి విన్నవించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వేడుకను ఆనందోత్సవాల మధ్య నిర్వహించేందుకు గాను కింది సదుపాయాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ, ఆధునిక సౌండ్ సిస్టం, భక్తుల సౌకర్యార్థం ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు కూడా వినతిపత్రం అందజేశారు. కమిటీ విన్నపంపై మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సానుకూలంగా స్పందించారు. నరకాసుర వధ ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపేందుకు తమ వంతు చొరవ చూపుతామని వారు హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతమ్, ఉపాధ్యక్షులు (అవునూరి రామ్మూర్తి, దూడే బాల కొమురెల్లి), సహాయ కార్యదర్శులు (వనం కుమార్, అవునూరి రామన్న, శెట్టి మోహన్), ఉప కోశాధికారి కోరె సాంబమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి తవటం నరసింహ, మరియు ఆర్గనైజర్లు (మాటేటిశ్యామ్, కుండె రాజు, ఆవు నూరి ఐలేశం, కొమ్ము రాజు, కాటం సతీష్) తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదాం

## ■ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట (మహబూబాబాద్) జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలలో బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందుతారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాడు స్థానికంగా ఉన్న బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మహేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు భారతీయ జనతా పార్టీ, నరేంద్ర మోదీ నాయకత్వం వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది అని విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ 'ఆరు గ్యారంటీల' పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మోండి చేయి చూపింది. ప్రజలకు ఇచ్చిన 420 గ్యారంటీలను గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురైంది," అని ఆయన ధ్వజమెత్తారు. జరుగుబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రత్యేకం గా గ్రామాలలోని ప్రజలు బీజేపీకే మొగ్గుచూపుతున్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు కీలక సూచనలు చేస్తూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో గొప్ప సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ రూరల్ మండల అధ్యక్షులు గణేష్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నెలకుర్తి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సింగారపు సతీష్, నంజల అశోక్, రాయల రాంబాబు, లకన్ వ్యాస్, రెహామాన్, బాసాని నాగేష్ పాల్గొన్నారు.

# 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' శిబిరానికి ఎల్‌బీ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు

## ● బీహార్ పర్యటనకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక
## ● ప్రిన్సిపాల్ డాక్టర్ డీహెచ్.రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక లాల్ బహదూర్ (ఎల్‌బీ) కళాశాలలోని ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ నుంచి ముగ్గురు క్యాడెట్లు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. కళాశాల విద్యార్థులైన శివప్రసాద్, కౌశిక్, నితీష్ శనివారం కాజీపేట నుంచి శిబిరం కోసం బయలుదేరారు. ఈ జాతీయ సమైక్యత శిబిరం అక్టోబర్ 06 నుంచి అక్టోబర్ 17 వరకు బీహార్ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక నగరం మోహితరీ జిల్లాలో బీహార్, జార్ఖండ్ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జరగనుంది. వీరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరపున ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రావు మాట్లాడుతూ ప్రాంతాలు వేరైనా, భాషలు, భావాలు వేరైనా మనందరం భారతీయులమనే సమైక్య స్ఫూర్తిని నింపేదే ఈ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' క్యాంపని అన్నారు. ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశాలు మన ఆచారకట్టుబాట్లు, సంస్కృతి, సాంప్రదాయాలను అక్కడి ఇతర రాష్ట్రాల క్యాడెట్లతో పంచుకోవడం.మన భాష, సాంఘిక కట్టుబాట్లను వారికి తెలియజేయడం, వారి భాష, సాంఘిక కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లను నేర్చుకోవడం. జాతి సమైక్యతకు చేయి చేయి కలిపి, మనమంతా భారతీయులమనే సమైక్య భావాన్ని చాటడం. ప్రిన్సిపాల్ డాక్టర్ రావు ఈ ముగ్గురు క్యాడెట్‌లను అభినందిస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ పరిధిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్య నారాయణ, సెక్రెటరీ వినయ్ కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, అధ్యాపకులు, ఇతర క్యాడెట్స్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



# దూకుడు మీదున్న ధనుష్

ఈ ఏడాది సౌత్ హీరోల నుంచి వరుస సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అదే తరహాలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటుడు ధనుష్ కూడా హిట్ ఫట్ తో సంబంధం లేకుండా తన సినిమాలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే కుబేర, ఇడ్లీ కొట్టు సినిమాలను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసిన ధనుష్, వీటి తర్వాత కూడా వెనక్కి తగ్గకుండా మరిన్ని ప్రాజెక్టులను రెడీ చేస్తున్నాడు. బాలీవుడ్‌లో తన మరో సినిమా తేరే ఇష్క్ మైనేల్ స్టేజ్‌కి చేరుకుంది. ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్ ఉన్న ధనుష్, ఈ మూవీతో బాలీవుడ్ ఆడియన్స్‌ను మళ్లీ ఆకట్టుకోబోతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండానే తన 54వ సినిమా కూడా థియేటర్లలోకి రానుంది.



# ఆ విషయాలు చెబితే నమ్మరు: జాన్వీ

నెపోటిజం, సినీ నేపథ్యం పదాలు ఇండస్ట్రీలో ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. బయటి వ్యక్తులు పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కోవాలని స్టార్స్ సైతం అంగీకరిస్తుంటారు. తాజాగా ఈ అంశంపై జాన్వీకపూర్ ఓ చర్చలో మాట్లాడారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారని కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. 'ఇన్‌సైడర్ అవుట్‌సైడర్' చర్చలో పాల్గొన్న జాన్వీకపూర్ నటీనటులను బయట వ్యక్తులు, సినీ పరిశ్రమకు చెందినవారు అని విభజించడం తనకు ఇష్టం లేదన్నారు. బయట నుంచి పరిశ్రమకు వచ్చినవారితో ఇండస్ట్రీ వారి కష్టాలను పోల్చడం అన్యాయమని అన్నారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయి. వాటిని వినడానికి కూడా ఎవరూ ఆసక్తి చూపరు. అయినా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ కిడ్స్ ఎవరూ కష్టాలు పడ్డామని చెప్పరు. ఎందుకంటే బయటి వారితో పోల్చితే వారికి లభించిన సౌకర్యాలకు వారెప్పుడూ కృతజ్ఞతతోనే ఉంటారు. అలాకాకుండా 'మేం ఇంత కష్టపడుతున్నాం' అని చెబితే ఎవరూ వినరు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఇండస్ట్రీలో గుర్తింపుతెచ్చుకోవాలంటే ఎన్నో పోరాటాలు చేయాలని నేనూ అంగీకరిస్తాను. ఆ పోరాటాలు స్టార్ కిడ్స్‌కు అర్థం కావని జాన్వీ తెలిపారు.

శ్రీదేవి కుమార్తెగా వెండితెరకు పరిచయమై.. మంచి పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు జాన్వీకపూర్. ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. వరుణ్ ధావన్‌తో కలిసి ఆమె నటించిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

# పుకార్లకు ఫుల్‌స్టాప్

## నిశ్చితార్థం చేసుకున్న రౌడీబాయ్..

కొంతకాలంగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక త్వరలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఇరు కుటుంబాలు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం శుక్రవారం జరిగినట్లు సమాచారం. ఇరువురి కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో నిమగమవుతుండగా, ఫిబ్రవరిలో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతుందని విశ్వసనీయ సమాచారం. ప్రముఖ సినీ, రాజకీయ, వ్యాపార రంగానికి చెందినవారంతా ఆ వివాహ వేడుకలో పాల్గనే అవకాశం ఉంది. విజయ్ దేవరకొండ, రష్మిక ఇప్పటికే కలిసి నటించిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల ద్వారా రొమాంటిక్ కెమిస్ట్రీతో మిలియన్ల అభిమానులను ఆకట్టుకున్నారు. అప్పట్నుంచి వీరి జంటపై అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఏర్పడిరది. ఇప్పుడు వీరి వివాహం అధికారికమవుతుందన్న వార్తతో సోషల్ మీడియాలో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు.



# గోపీచంద్ మలినేనితో బాలయ్య సినిమా

వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని మరోసారి కలిసి పని చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 24న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు విజయ దశమి సందర్భంగా ప్రకటించారు. చారిత్రక అంశాలతో ముడిపడిన యాక్షన్ కథతో రూపొందనున్న చిత్రమిది. బాలకృష్ణ ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిరచనున్నారు. ఇక ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమాని డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు దసరా సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాకి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తుండగా.. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు.



# ఓటీటీలోకి మిరాయ్

తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఫాంటసీ అడ్వెంచర్ 'మిరాయ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ సంస్థ ఓ పోస్టర్ పంచుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నట్లు జియో హాట్‌స్టార్ తెలిపింది. . మరి ఆ తర్వాత ఏమైంది? అనాథగా వివిధ ప్రాంతాల్లో పెరిగిన వేద తన బాధ్యతను.. తల్లి ఆశయాన్ని ఎలా తెలుసుకుంటాడు? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి.



# ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కీలక అంశాలపై అధికారులకు పలు సూచనలు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్ కుమార్, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్), సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, రూట్ మ్యాప్ తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతుల మంజూరు వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. మొదటి విడతలో ఐదు మండలాలు, రెండో విడతలో ఆరు మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు.

**నియమావళి కఠినంగా అమలు..**

ఎన్నికల శాంతియుత నిర్వహణకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)ను కఠినంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి లైవ్ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఆర్‌ఓలు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు టాయిలెట్స్, ఫర్నీచర్, ర్యాంప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాలకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్ రూపొందించాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**బ్యాలెట్ బాక్సులు సిద్ధం..**

ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ కల్పించాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అక్రమ ప్రచారాలు వంటి ఉల్లంఘనలపై నిరంతరం నిఘా పెట్టి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత పొరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం యేదైనా సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకూ భద్రతతో కూడిన వాతావరణంలో ఓటు వేసే అవకాశం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రామి రెడ్డి, డీపీఓ కల్పన, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే సాకారం

- ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం
- కౌశల్ దీక్షాంత్ సమరోహలో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సీఎం నితీశ్ కుమార్




**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) లు ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్ అని ప్రధాని పేర్కొన్నారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62 వేల కోట్లకు పైగా విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢల్లీలో ప్రారంభించారు. ఢల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహలో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ.60 వేల కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10వేల ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో ఐదు వేల కొత్త ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్టాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలన తో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బ్జడెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దు కునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం 'సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

# అల్లుడికి 100 వంటకాలు



- 101వ వంటకంగా తులం బంగారం
- తెలంగాణ అల్లుడికి వింత అనుభవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వనపర్తి జిల్లాలోని కొత్తకోట పట్టణంలో మాజీ ఎంపీపీ గుంత మౌనిక-మల్లేష్ కుటుంబం అంటే ఆతిథ్యానికి పెట్టింది పేరు. వారి ముద్దుల కూతురు గుంత సహన-సురేష్ దంపతుల అమ్మాయి సింధును గత నెలలో వరంగల్ ప్రాంతానికి చెందిన మాదారపు నిఖిత్ కు ఇచ్చి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. పెళ్లయిన తర్వాత వచ్చిన మొట్టమొదటి పండగ విజయదశమి కావడంతో కొత్త అల్లుడు నిఖిత్ మామగారింట్లో అడుగిడగానే.. అక్కడ సందడి మామూలుగా లేదు! గోదారోళ్లకు ఏ మాత్రం తగ్గకుండా, తెలంగాణ మాన్యంలో తమ ఇంటి మర్యాదలను నాటుగా, ఘాటుగా చాటి చెప్పాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. అనుకున్నట్టుగా, పాతకాలం నాటి నుంచి నేటిదాకా ఉన్న నూట ఒక్క రకాల శాఖాహార పిండివంటలతో దద్దరిల్లే విందు భోజనం ఏర్పాటు చేశారు. విస్తారంగా పరిచిన భారీ అరిటాకులో కమ్మటి వంటకాలన్నీ వడ్డించారు. ఆ రుచులను చూస్తేనే నోరూరింది, అల్లుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు! అయితే, నిఖిత్ మామూలు తెలివిగల మొనగాడు కాదు కదా! దసరా సరదాకు మామను ఆటపట్టించాలని, అరిటాకులో వడ్డించిన వంటకాలన్నీ లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. తీరా చూస్తే, చెప్పినట్టుగా 101 బదులు, ఆ విస్తరాకులో 100 రకాల పిండి వంటకాలు మాత్రమే ఉన్నాయి! ఇంకేముంది, సరదాగా మామను మారాం చేయాలనుకున్న అల్లుడు... 'మామా, మీరు మాట తప్పవద్దు! నాకు ఇంకో ఒకటి అంటే 101వ వంటకం తక్కువైంది. నాకు చెప్పిన లెక్క ప్రకారం నూట ఒక్క రకాలు కావాల్సిందే! లేదంటే, ఆ తక్కువైన వంటకానికి బదులుగా నాకు ఒక తులం బంగారం ఇయ్యాలె!' అని గట్టిగా పట్టుబట్టాడు. కొత్త అల్లుడిని నొప్పించడం ఇష్టంలేదు. అడిగింది ఇవ్వకపోవడం మామకి అంతకన్నా కష్టం. ఏం చేసేది లేక, అల్లుడి సరదాకు తలొగ్గి, ఆ 'తక్కువైన' 101వ పిండివంటకంగా ఒక తులం బంగారాన్ని ఇచ్చి, అల్లుడి కళ్లలో ఆనందం చూశారు మామగారు! ఈ విందు భోజనం వనపర్తి-వరంగల్ బంధాన్ని మరింత ఘాటుగా చేసింది.



# ప్రజావాణి రద్దు

☐ కలెక్టర్ దివాకర టి.ఎస్.

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

– వరంగల్ వాయిస్, ములుగు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com